

జగన్నాథపురంలో నిరసన తెలుపుతున్న ఏసు కుటుంబ సభ్యులు

'గులాబీ'కి మరో దెబ్బ!



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలోనూ బీఆర్‌ఎస్‌ ఓటమి
- గతంలో ఇదే స్థానంలో నాలుగు సార్లు విజయం
- ఇటీవలి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కుదేలు
- కంచుకోటలో వరుస పరాజయాలతో కేడర్‌ పక్కచూపులు
- తొలిసారిగా పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్‌ పాగా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్‌)

నిన్నమొన్నటి వరకు బీఆర్‌ఎస్‌ కంచుకోటగా ఉన్న పోరుగల్లు.. ఓరుగల్లులో ఆ పార్టీకి మరో దెబ్బ తగిలింది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికల్లో వరుస ఓటములు చవిచూసిన ఆ పార్టీకి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ పరాభవం తప్పలేదు. దాంతో కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాలు బీటలు వారుతుండం.. వరుస పరాజయాలు ఎదురవుతుండటంతో భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్న గులాబీ కేడర్‌ పక్క చూపులు చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకోకముందే లోక్‌సభ ఎన్నికల్లో పరాజయంతో తీవ్ర నిరాశలో ఉండగా.. నాలుగు పర్యాయాలు విజయం సాధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలోనూ ఓటమి చవిచూడడాన్ని ఆపార్టీ కేడర్‌ జీర్ణించుకోలేకపోతోంది. తమకు గట్టి పట్టున్న ఓరుగల్లులో పార్టీ బలహీన పడుతుంటే అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టడం లేదనే ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు కీలక నేతలు కారు దిగేందుకు రెడీ అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. కొందరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు కీలక నేతలు ఇప్పటికే కాంగ్రెస్‌, బీజేపీ నేతలతో టచ్‌లోకి వెళ్లినట్టుగా సమాచారం.

పరాజయాలతో గులాబీ పరేషాన్‌

తెలంగాణ ఉద్యమంలో అండగా నిలిచిన పోరుగడ్డ ఓరుగల్లులో బీఆర్‌ఎస్‌కు వరుస ఓటములు మింగుడు పడటం లేదు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఎమ్మెల్యేలు ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచే విజయం సాధించారు. అంతేకాకుండా 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్‌, మహబూబాబాద్‌ ఎంపీ స్థానాలను గెలుచుకుని బలమైన పార్టీగా ఆవిర్భవించింది. నాటి పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్‌, బీజేపీ, టీడీపీ నుంచి కీలకమైన నేతలు, ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌ గూటికి చేరారు. లీడర్‌, కేడర్‌తో బలంగా ఉన్న బీఆర్‌ఎస్‌ 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీ చైర్మన్లతో పాటు మెజారిటీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను గెలుచుకుని బలమైన శక్తి బీఆర్‌ఎస్‌ ఎదిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు బలమైన రాజకీయ పక్షంగా ఉన్న బీఆర్‌ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కష్టకాలం మొదలైందనే చర్చ జరుగుతోంది. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో కేవలం జనగామ, స్టేషన్‌ఘనపూర్‌ నియోజకవర్గాల్లోనే బీఆర్‌ఎస్‌ గెలిచింది. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. దీంతోపాటు పార్లమెంట్‌ ఎన్నికల వేళ స్టేషన్‌ఘనపూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కారు దిగి హస్తం గూటికి చేరారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో తన కూతురిని కాంగ్రెస్‌ అభ్యర్థిగా బరిలో దించి ఎంపీ గా గెలిపించుకున్నారు. కడియంతో పాటు వరంగల్‌ జిల్లా బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ సైతం బీజేపీలోకి వెళ్లారు. డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు, వరంగల్‌ నగర మేయర్‌ గుండు సుధారాణి ఎవరికివారు కాంగ్రెస్‌ లో చేరారు. వీరితో పాటు కీలక నేతలు చాలా మంది కాంగ్రెస్‌, బీజేపీల్లో చేరారు. ఈ నేపథ్యంలో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా హనుమకొండ జడ్పీ చైర్మన్‌ సుధీర్‌కుమార్‌ను బరిలో దించగా ఆయన మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఏ ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనూ బీఆర్‌ఎస్‌ తన ప్రభావాన్ని చూపలేకపోయింది. పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్‌ నియోజకవర్గంలో కొన్ని ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మిగతా ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ వర్సెస్‌ బీజేపీ అన్నట్టుగానే పోలింగ్‌ జరిగింది. బీఆర్‌ఎస్‌ మూడోస్థానానికి పరిమితం కావటంతో అప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఉన్న కేడర్‌కు మింగుడు పడకుండా తయారైంది. మహబూబాబాద్‌ ఎంపీగా పోటీ చేసిన మాలోతు కవితకు కూడా ఏ అసెంబ్లీ నియోకవర్గంలోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించలేకపోయారు. ఇక్కడ బీజేపీ బలంగా లేకపోవటంతో బీఆర్‌ఎస్‌ రెండో స్థానంలో నిలవటం కొంత ఉపశమనంగా భావిస్తున్నారు. అయినా ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీల్లో ఒక్కటి కూడా గెలవకపోవడం కేడర్‌లో నిరాశను నింపింది.

పట్టభద్రుల ఝలక్‌తో మరింత కుదేలు..

గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాల్లోనూ ఎదురుదెబ్బలు తప్పటం లేదు. 2009 నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గెలిచిన వరంగల్‌, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పట్టు నిలుపుకోలేకపోయింది. తాజాగా జరిగిన ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్‌ తగిలింది. ఉద్యమ సమయంలోనే కాకుండా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్‌ వైపు నిలిచిన పట్టభద్రులు కాంగ్రెస్‌, బీజేపీలకు అవకాశం లేకుండా చేశారు. నాలుగు సార్లు బీఆర్‌ఎస్‌ అభ్యర్థులకే పట్టం కట్టారు. అయితే గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లారాజేశ్వరరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యం కాగా.. ఈ సిట్టింగ్‌ స్థానంలో తిరిగి గెలవాలని బీఆర్‌ఎస్‌ వ్యూహాత్మకంగా ఏనుగుల రాకేష్‌రెడ్డిని బరిలో దించింది. అయినప్పటికి రెండో ప్రాధాన్యత ఓట్లతో కాంగ్రెస్‌ అభ్యర్థి తీన్మార్‌ మల్లన్న విజయం సాధించారు. దీంతో ఈ స్థానంలో తొలిసారి కాంగ్రెస్‌ పాగా వేసింది. కాగా, ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో ఉన్న గులాబీ శ్రేణులకు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటమి మరింత కుంగతీస్తోంది.

గులాబీ నేతల పక్కచూపులు..?

వరుస ఓటములతో రాజకీయ భవిష్యత్‌పై కొందరు నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌, బీజేపీల్లో చేరిపోయారు. చాలామంది నేతలు కేసీఆర్‌, కేటీఆర్‌, హరీష్‌రావులపై అభిమానం.. ఉద్యమం నుంచి వచ్చిన పార్టీ అన్న భావనతో కొనసాగుతున్నారు. కానీ తమ భవిష్యత్‌ దృష్ట్యా కొందరు పక్కచూపులు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్‌లో ఎంపీల ప్రమాణస్వీకారం తరువాత బీఆర్‌ఎస్‌ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురు ఉమ్మడిజిల్లా ముఖ్యనేతలు కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. కొందరు నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితోనే మంతనాలు చేస్తుండగా, మరికొందరు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పార్టీలో చేరే విషయమై చర్చలు జరుపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని, ఇప్పటికే కేంద్రంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరనుండటం, రాష్ట్రంలో కాంగ్రెస్‌ వర్సెస్‌

▸▸ మిగతా 6వ పేజీలో..

ఏసుపై ఇన్‌ఫార్మర్‌ ముద్ర వేయడం సరికాదు

మావోయిస్టుల వైఖరిపై కుటుంబ సభ్యుల నిరసన

వాజేడు, జూన్‌ 8: ములుగు జిల్లా వాజేడు మండలంలో ఇటీవల మందుపాతరకు బలైన ఇల్లెందు ఏసుపై మావోయిస్టులు ఇన్‌ఫార్మర్‌ ముద్ర వేయడం సరికాదని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం నిరసనకు దిగారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఏసు కొంగాల అటవీ ప్రాంతంలో కట్టెల కోసం వెళ్లి మందుపాతర పేలి మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో మావోయిస్టులు ఓ లేఖను విడుదల చేశారు. పోలీసులే మావోయిస్టుల జాడ కోసం ఏసును అడవికి పంపారని పేర్కొన్నారు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. మావోయిస్టులు తమ తప్పును కప్పి పుచ్చుకొనేందుకు ఏసుపై ఇన్‌ఫార్మర్‌ ముద్ర వేస్తున్నారని దుయ్యబట్టారు. ఏసు మృతికి కారకులైన మావోయిస్టులు పరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు.

ఈ క్రమంలో ఏసు కుటుంబ సభ్యులను పరామర్శించిన వెంకటాపురం(నూగూరు), వాజేడుకు చెందిన కోగిల మల్లికార్జున్‌, యాసం మహేష్‌, చెన్నం నరేష్‌, తోకల శివ, చెన్నం స్వామి, కోగిల ఆనంద్‌ రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

జూనియర్‌ అసిస్టెంట్‌ రమేష్‌ది హత్యే..

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు


నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ

కాకతీయఖని, జూన్‌ 8: భూపాలపల్లి మునిసిపల్‌ కార్యాలయంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పంగ రమేష్‌ది హత్యేనని, నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ సంపత్‌రావు వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను ఆయన ప్రవేశపెట్టారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుళ్లకోట గ్రామానికి చెందిన వంగ రమేష్‌(50) భూపాలపల్లి పట్టణంలోని రాంనగర్‌కాలనీ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. స్థానిక మునిసిపల్‌ కార్యాలయంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గొడిశాలకు చెందిన రమేష్‌ తోడల్లుడు దొంతు మల్లేష్‌ వ్యక్తిగత అవసరాల నిమిత్తం రమేష్‌ వద్ద రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలని పలుమార్లు మల్లేష్‌ను రమేష్‌ అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో రమేష్‌ను ఎలాగైనా మట్టుబెట్టాలని పథకం రచించాడు. తన కొడుకు దొంతు నాగరాజుతోపాటు భూపాలపల్లికి చెందిన స్నేహితుడు దండు జితేందర్‌తో కలిసి రమేష్‌ను హత్య చేసేందుకు ప్లాన్‌ వేశాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న రమేష్‌పై శుక్రవారం తెల్లవారుజామున ముగ్గురు దాడి చేశారు. బాగా కొట్టడం వల్ల రమేష్‌ అక్కడి కక్కడే మృతి చెందాడని డీఎస్పీ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసిన భూపాలపల్లి పోలీసులు నిందితులను శనివారం అరెస్టు చేశారని చెప్పారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఇన్‌చార్జ్‌ సీఐ మల్లేష్‌యాదవ్‌, ఎస్సై ప్రసాద్‌ను అభినందించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాజిరెడ్డి మృతదేహం

మొగుళ్లపల్లి, జూన్‌ 8: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఇస్సిపేట గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై అశోక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు యార రాజిరెడ్డి(58) ఇంట్లో బియ్యం పూర్తిగా లేకపోవడంతో వడ్ల బస్తాలను రైస్‌మిల్లులో పట్టించేందుకు వాహనాన్ని తీసుకొచ్చాడు. బస్తాలను వాహనంలో లోడ్‌ చేసుకుని బయల్దేరాడు. ఈక్ర మంలో వాహనాన్ని రివర్స్‌ చేస్తుండగా విద్యుత్‌ స్తంభం నుంచి ఇంట్లోకి ఉన్న సర్వీసు వైరు అడ్డుగా ఉండటంతో రాజిరెడ్డి చేతితో పక్కకు జరిపే ప్రయత్నం చేశాడు. వైరు ఫెయిలై ఉండగా కరెంటు షాక్‌ తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

గ్రూప్‌-1 ప్రిలిమినరీకి ఏర్పాట్లు పూర్తి

భూపాలపల్లి జిల్లాలో పరీక్ష రాయనున్న 4,473 మంది

భూపాలపల్లి కలెక్టరేట్‌, జూన్‌ 8: గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 4,473 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఇందుకు 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షను నిర్వహించనున్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సర్వం సిద్ధం చేశారు. టీజీపీఎస్సీ నిబంధనల ప్రకారం దివ్యాంగులకు 50 నిమిషాల అదనపు సమయం ఇవ్వనున్నారు.

జిల్లాలో పరీక్ష 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు వీటిని ఐదు రూట్లుగా విభజించారు. ప్రతి రూట్‌కూ ఒక అధికారిని నియమించారు. ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లో ఐదుగురు, 17 మంది సీఎస్‌లు, అబ్జర్వర్లు విధులు నిర్వర్తించనున్నారు. పరీక్షకు బయోమెట్రిక్‌ తప్పనిసరి కావడంతో 160 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్లు, ఇద్దరు చొప్పున ఐడెంటిఫికేషన్‌, పోలీస్‌ బయోమెట్రిక్‌ అధికారులను నియమించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 10 గంటల వరకు మాత్రమే ప్రవేశం ఉండటంతో గంట ముందు నుంచే అనుమతి ఇవ్వనున్నారు.

పటిష్ఠ బందోబస్తు : ఎస్పీ కిరణ్‌ కరే

కాకతీయఖని : గ్రూప్‌-1 పరీక్షలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ ఖరే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి పట్టణంలో 12, గణపురం మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 17 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ విధించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.

పరీక్ష కేంద్రాలివే...

- ప్రభుత్వ ఉన్నత పాఠశాల- చెల్పూర్‌
- ప్రభుత్వ ఉన్నత పాఠశాల- గణపురం
- సీఎస్‌ఐ హైస్కూల్‌- గణపురం క్రాస్‌ రోడ్‌
- తెలంగాణ మోడల్‌ స్కూల్‌-గణపురం
- ఎస్‌ఆర్‌ డిజి స్కూల్‌, కారల్‌మార్క్స్‌కాలనీ, భూపాలపల్లి
- ప్రభుత్వ ఉన్నత పాఠశాల-జంగేడు, భూపాలపల్లి
- ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌- బస్టాండ్‌, భూపాలపల్లి
- సన్‌వ్యాలీ హైస్కూల్‌-మెయిన్‌ రోడ్‌, భూపాలపల్లి
- సంఘమిత్ర కాలేజీ- పోలీస్‌ స్టేషన్‌ దగ్గర, భూపాలపల్లి
- బిట్స్‌, రిలయన్స్‌ పెట్రోల్‌ బంక్‌- భూపాలపల్లి
- మాంటిస్సోరీ హైస్కూల్‌- మెయిన్‌రోడ్‌, భూపాలపల్లి
- ఆక్స్‌వర్డ్‌ హైస్కూల్‌- సుభాష్‌కాలనీ, భూపాలపల్లి
- ప్రభుత్వ ఉన్నత పాఠశాల- భూపాలపల్లి
- సెయింట్‌పీటర్స్‌ హైస్కూల్‌- కారల్‌మార్క్స్‌ కాలనీ, భూపాలపల్లి
- శ్రీచైతన్య స్కూల్‌- గాంధీనగర్‌, భూపాలపల్లి
- ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ- కృష్ణకాలనీ, భూపాలపల్లి
- డీఏవీ హైస్కూల్‌- జెన్కో, చెల్పూర్‌.

అయ్యో బిడ్డా..

ప్రమాదవశాత్తు బావిలో పడ్డ ఇద్దరు బాలికలు

ఒకరి మృతి, మరొకరు సురక్షితం

పొలం వద్ద ఆడుకుంటుండగా ప్రమాదం


మార్చురీ వద్ద శవ పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్‌


ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ శాంతిక


వేదశ్రీ (ఫైల్‌)

ములుగు, జూన్‌ 8: పొలం వద్దకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లింది ఓ చిన్నారి. ఆమెకు మరో చిన్నారి తోడైంది. వ్యవసాయ బావి వద్ద ఆడుకుంటుండగా ఒక్కసారిగా ఇద్దరూ అందులో పడిపోయారు. ఓ చిన్నారి అందులోనే ప్రాణాలు వదలగా, మరొకరు సురక్షితంగా బయట పడింది. ఈ ప్రమాదం ములుగు మండలం లాలాయిగూడెం గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందరావుపేట మండలం పాపయ్యపల్లికి చెందిన బానోత్‌ కృష్ణవేణి, అశోక్‌ దంపతులకు వేదశ్రీ (5)తోపాటు 11 నెలల కుమారుడు ఉన్నాడు. కృష్ణవేణి తల్లిగారి గ్రామమైన ములుగు మండలం లాలాయిగూడేనికి ఆ కుటుంబం బతుకుదెరువు కోసం ఏడాది క్రితం వలస వచ్చింది. స్థానిక పెట్రోల్‌బంక్‌లో అశోక్‌ గుమస్తాగా పనిచేస్తుండగా కృష్ణవేణి ఇంటి వద్దే ఉంటోంది. వీరి ఇంటి పక్కనే ఉన్న శ్రీలక్ష్మి, శ్రీనివాస్‌ దంపతులు నివసిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం తమ పొలంలో పనిచేసేందుకు శ్రీలక్ష్మి, శ్రీనివాస్‌ దంపతులు వెళ్లారు. వీరి కుమార్తె శాంతిక కూడా తల్లిదండ్రులతో కలిసి పొలం వద్దకు వెళ్లింది. ఆ చిన్నారికి వేదశ్రీ తోడైంది. పొలం వద్ద ఆడుకుంటుండగా సాయంత్రం 5గంటల సమయంలో పక్కనే ఉన్న బావిలో ఇద్దరూ ప్రమాదవశాత్తు పడిపోయారు. ఆలస్యంగా గమనించిన శ్రీలక్ష్మి, శ్రీనివాస్‌ దంపతులు పరుగున బావి వద్దకు చూడగా అప్పటికే వేదశ్రీ మృతి చెంది ఉంది. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న శాంతికను బయటకు తీసి ములుగు ఏరియా వైద్య శాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శాంతిక కోలుకుంది. వేదశ్రీ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వర్‌ కేసు నమోదు చేశారు. వేదశ్రీ ప్రాణాలను కోల్పోవడంతో తల్లి దండ్రులు కుప్పకూలిపోయారు. ఆడుతూ పాడుతూ ఇంటిల్లిపాదిని అలరించే బిడ్డ కానరాని లోకాలకు వెళ్లడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. చిన్నారి మృతితో లాలాయిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కేసుల రాజీతో ప్రశాంత జీవనం

ములుగు జిల్లా జడ్జి సూర్యచంద్రకళ



లోక్‌ అదాలత్‌లో మాట్లాడుతున్న ములుగు జడ్జి సూర్యచంద్రకళ

ములుగు, జూన్‌ 8: కేసుల పరిష్కారంలో రాజీ పడడం ద్వారా ప్రశాంత జీవనం గడపాలని జిల్లా జడ్జి ఎస్‌.వి.పి.సూర్యచంద్రకళ అన్నారు. జిల్లాకోర్టు ఆవరణ లో జాతీయ లోక్‌ అదాలత్‌ శనివారం జరిగింది. మూడు బెంచీలను ఏర్పాటు చేయగా మొత్తం 342 కేసులను పరిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ లోక్‌ అదాలత్‌లో కేసులను రాజీ కుదుర్చుకుంటే అదే అంతిమ తీర్పు అన్నారు. తదుపరి అప్పీల్‌కు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. లోక్‌ అదాలత్‌ను విజయవంతం చేసిన అధికారులు, న్యాయవాదులను ఆమె అభినందించారు. లోక్‌ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్‌ సివిల్‌ జడ్జి టి.కన్నయ్య లాల్‌, ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి రామ్మోహ న్‌రెడ్డి, ఎస్పీ శబరీశ్‌, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్‌యాదవ్‌, డీఎస్పీ రవీందర్‌, సీఐలు రంజిత్‌కుమార్‌, శంకర్‌, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, న్యాయవాదులు నర్సిరెడ్డి, మహేందర్‌, చంద్రయ్య, భిక్షపతి, సుధాకర్‌, స్వామిదాసు, ప్రతాప్‌, రాజ్‌కుమార్‌, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి ఇంజనీరింగ్ కళాశాలల్లో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన ఈసెట్-2024 కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని వరంగల్ జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్ క్యాంపు ఆఫీసర్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు వారి వారి సమయానుసారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

'గులాబీ'కి మరో దెబ్బ!

(5వ పేజీ తరువాయి)

బీజేపీ అన్నట్టుగా రాజకీయాలు మారబోతున్నాయన్న అంచనాల నడుమ బీజేపీలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో పలువురు హైదరాబాద్‌లో కాషాయ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. వచ్చే 2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని, రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య 119 నుంచి 175కు పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ముందుగానే గోడ దూకి అసెంబ్లీ సీటుపై కర్చీఫ్ వేసుకోవాలనే ఆలోచనలో కొందరు గులాబీ నేతలు పక్కచూపులు చూస్తున్నారనే చర్చ జరుగుతోంది. మొత్తానికి వరుస ఓటములు గులాబీ పార్టీకి కష్టకాలాన్నితెచ్చి పెట్టాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. ఈ కష్టకాలం నుంచి గట్టెక్కేందుకు గులాబీ బాస్ ఎలాంటి అడుగులు వేస్తారనేది ఓరుగల్లు రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

గృహిణి అదృశ్యం

వరంగల్ క్రైం, జూన్ 8: కూతురితో కలిసి మాధవి అనే గృహిణి అదృశ్యమైన సంఘటన కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లో పెద్దకాసు శ్రీశైలం, మాధవి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఏడేళ్ల కూతురు ఉంది. ఈనెల 6వ తేదీన మాధవి(26) తన కూతురుతో కలిసి ఇంట్లో సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో రెండు రోజుల పాటు వెతికిన శ్రీశైలం.. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ప్రతీ సారి ఇదే తంతు

దొరికితేనే బయటపడుతున్న దొంగలు ● మూల్యాంకనంలో కొరవడిన నిఘా
అక్రమార్కులకు అందివస్తున్న అధికారుల పర్యవేక్షణ లోపం



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8 : కాకతీయ విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగంలో జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతున్న ప్రతీసారి జవాబు పత్రాలు బయటకు వెళుతున్నట్లు వర్సిటీ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్పాట్ జరుగుతున్నప్పుడు నిఘా కొరవడుతుండటంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్పాట్ క్యాంపులోకి ప్రైవేటు వ్యక్తులను దినసరి కూలీలను తీసుకుంటున్న కేయూ అధికారులు.. వారిపై పర్యవేక్షణ చేయడంలో నిర్లక్ష్యం వహించడంతోనే వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు వర్సిటీ వర్గాలు అభిప్రాయపడుతున్నారు. స్పాట్ క్యాంపులకు 25 మంది డెయిలీ వేజెస్ కింద నియమించుకుంటున్నారు. కోడింగ్ జరుగుతున్న క్రమంలో వారు పేపర్ బండిళ్లలోని పేపర్లను మాయం చేస్తూ బయటకు పంపిస్తున్నారు.

ఇందుకు ఒక్కో పేపర్‌కు రూ.5వేల నుంచి 10వేలు వసూల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిని అధికారులు గుర్తిస్తే తప్ప దొంగలు బయటపడటం లేదు. ప్రతీసారి స్పాట్ క్యాంపు నుంచి జవాబు పత్రాలు బయటకు తీసుకెళుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారుల తోడ్పాటు లేకుండా జవాబు పత్రాలు బయటకు ఎలా వెళ్లుతాయి? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. పూర్తి స్థాయిలో విచారణ చేస్తేనే అసలు నిజాలు బయట పడతాయనే అభిప్రాయాలను వర్సిటీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

నిఘా వైఫల్యం.. పర్యవేక్షణ శూన్యం..

పరీక్షల విభాగంలోని స్పాట్ క్యాంప్‌ల్లో అధికారుల నిఘా వైఫ్యల్యంతోనే తరుచూ జవాబు పత్రాలు బయటకు వెళుతున్నాయి. దినసరి వేతనం కింద నియమిస్తున్న ప్రైవేటు వ్యక్తులపై అధికారుల పర్యవేక్షణ శూన్యం కావడంతో వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. స్పాట్ క్యాంపుల్లో 25 మంది వరకు ప్రైవేటు వ్యక్తులు పనులు చేస్తున్నారు. వీరంతా రోజుకు రూ.260 చొప్పున పనిచేస్తున్నారు. కోడింగ్ సమయాల్లో వీరిపై నిఘా కొరవడటంతో జవాబు పత్రాల బండిళ్ల తీస్తున్నప్పుడు వాటిల్లో నుంచి ముందుగా ఒప్పందం కుదుర్చుకున్న విద్యార్థులకు సంబంధించిన జవాబు పత్రాలను తీసుకెళ్లి వారికి అందజేస్తున్నారు. వారు మళ్లీ జవాబులు రాసేందుకు అడిషనల్ పేపర్లు ఇచ్చి వారితో రాయించి ఆ పేపర్లను తిరిగి బండిళ్లలో సర్దుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులకు మాత్రం కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నిఘా నేత్రానికి దొరికితేనే దొంగలు

సీసీ కెమెరాల ఫుటేజీలో చూస్తేనే తప్ప.. దొంగలు బయట పడటం లేదు. నిరంతరం నిఘా ఉంచాల్సిన జవాబు పత్రాలు బయటకు వెళుతుంటే అధికారులకు మాత్రం కనిపించడం లేదు. రెగ్యులర్ ఉద్యోగుల భద్రతలో ఉండాల్సిన విద్యార్థుల భవితవ్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పరిహాసం అవుతున్నా అధికారులు తూతూ మంత్రపు చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సంఘటనలు బయట పడినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప.. అసలు సంఘటనలు జరుగకుండా పూర్తి స్థాయి భద్రత చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిఘా వైఫ్యలం, పర్యవేక్షణ కొరవడటంతోనే అక్రమాలకు పాల్పడుతూ విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెడుతూ డబ్బులు దండుకుంటున్న వారిపై నామమాత్రపు చర్యలే తీసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

11 మంది.. 25 పేపర్లు..

కేయూలో జరిగిన సంఘటనలో మొత్తం 25 జవాబు పత్రాలు మార్పిడీ జరిగినట్లు తెలుస్తుంది. ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు.. మరో 8 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారిపై కేసు నమోదు చేశారు.

లెక్కతేలిన పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్

1,098 ఎల్పీ పోస్టులు, 265 పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో చేపడుతున్న భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ లెక్క తేలింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,231 భాషా పండితుల పోస్టులు ఉండగా, అందులో 1,098 పోస్టులు స్కూల్ అసిస్టెంట్(భాష) పోస్టులుగా ఉన్నతీకరణ కానున్నాయి. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 321 పీఈటీ పోస్టులు ఉండగా, అందులో 265 పోస్టులు పీడీలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,363 పోస్టులు అప్‌గ్రేడ్ కానున్నట్లు విద్యాశాఖ వివరాలు వెల్లడించింది.

తెలుగు భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	128	114
హనుమకొండ	103	92
జనగామ	115	102
జయశంకర్ భూపాలపల్లి	75	67
మహబూబాబాద్	149	133
ములుగు	57	51

హిందీ భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	119	106
హనుమకొండ	108	96
జనగామ	111	99
జయశంకర్ భూపాలపల్లి	76	68
మహబూబాబాద్	126	112
ములుగు	57	51

ఉర్దూ భాషా పండితులు

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	2	2
హనుమకొండ	4	4
జనగామ	1	1

పీఈటీ అప్‌గ్రేడేషన్ ఇలా...

జిల్లా	సాంక్షన్ పోస్టులు	అప్‌గ్రేడ్ పోస్టులు
వరంగల్	72	59
హనుమకొండ	74	61
జయశంకర్ భూపాలపల్లి	37	31
జనగామ	58	48
మహబూబాబాద్	58	48
ములుగు	22	18

కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 8: కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలను తాత్కాలింగా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలను తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో తర్వాత ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు.

రుణమాఫీకి కసరత్తు!

2019 ఏప్రిల్ 1 నుంచి తీసుకున్న వారికి వర్తింపు ● గత ఏడాది డిసెంబరు 10 వరకు కటాఫ్ ● మార్గదర్శకాలపై ఉత్కంఠ

వెంకటాపూర్(రామప్ప), జూన్ 8: పంట రుణాల మాఫీపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని తెలుస్తోంది. తాము అధికారంలోకి వస్తే రూ.2లక్షల వరకు పంటరుణాలు మాఫీ చేస్తామని ఆసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తమ మేనిఫెస్టోలో ప్రకటించింది. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ పంట రుణాల మాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి మరింత స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని తెలుస్తోంది. రుణమాఫీ ఎప్పటి నుంచి ఎప్పటి వరకు అనే అంశంపై స్పష్టత ఇచ్చింది. అంతేకాక నిర్దేశించిన కాలంలో పంట రుణాలపై తీసుకున్న రైతుల సమాచారాన్ని తయారు చేయాలని బ్యాంకర్లకు దిశానిర్దేశం చేసిందని సమాచారం.

అయితే పంటరుణాల లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలు రూపొందించలేదు. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో పంట రుణాల మాఫీ, తిరిగి కొత్తరుణాలు, పంటల సాగు వంటి వాటిపై రైతులు ఆశలు పల్లకీలో ఉన్నాయి. ములుగు జిల్లాలో ప్రతిఏటా 84వేల మంది రైతులు సుమారు 1.30లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా వీరిలో లక్షకు పైగా కౌలు రైతులు కూడా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

కటాఫ్ నిర్దేశించిన ప్రభుత్వం

పంట రుణమాఫీ కాలాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబరు 10 వరకు తీసుకున్న పంట రుణాలకు మాఫీ వర్తించేలా కాలాన్ని గుర్తించింది. ఈ కాలంలో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతులు ప్రతి ఏడాది తీసుకున్న రుణాలు రెన్యూవల్ చేసుకుంటూ, కొత్త రుణాలు తీసుకుంటున్నట్లు బ్యాంకు రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారు. బ్యాంకులు కూడా ఏటా వడ్డీలను జమ చేసుకోవడం, రుణాన్ని పెంచి ఇవ్వడం చేస్తున్నాయి. ములుగు జిల్లాలో ప్రతిఏటా వానాకాలం, యాసంగి పంట రుణాలుగా సుమారు రూ.2 కోట్ల వరకు ఇస్తుంటారు. మొత్తం దాదాపు 90వేల మంది రైతులు పంటరుణాలు పొందుతున్నారు.

అర్హత, మార్గదర్శకాలపై ఉత్కంఠ

పంటరుణాల మాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చినప్పటికీ ఇంకా మార్గదర్శకాలు రూపొందించలేదు. రుణమాఫీ వ్యవహారంలో ప్రభుత్వం అర్హతలు, మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటోంది. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ ఆమలు చేసినప్పుడు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తింపచేసేలా మార్గదర్శకాలు రూపొందించింది. ప్రస్తుత ప్రభుత్వం అర్హతలు, మార్గదర్శకాలపై ఉత్కంఠ నెలకొంది. కొందరు రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొంది, ప్రభుత్వాలు మాఫీ అనడంతో కనీసం రెన్యూవల్ కూడా చేయించుకోకుండా తమకు మాఫీ వర్తింస్తుందని ఆశగా ఉన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది.

వారి పరిస్థితి ఏమిటి?

గత ప్రభుత్వం రూ.లక్షలోపు పంట రుణమాఫీ పథకాన్ని ఆమలు చేసింది. 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబరు 11 వరకు కుటుంబంలో ఒకరికి రూ. లక్షలోపు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసేలా మార్గదర్శకాలు రూపొందించింది. ఆ సమయాన ములుగు జిల్లాలో 50 శాతం మంది రైతులు, రూ.2కోట్ల4లక్షల వరకు పంట రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు.

ఈమొత్తం రైతుల్లో అర్హులైన వారికి నాలుగు విడతలుగా రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, ఆ నాలుగు విడతల్లో సుమారు 80 శాతం మంది రైతులకు, రూ.3కోట్ల వరకు రుణమాఫీ చేసింది. అందులో రూ.1.59కోట్లు ఫెయిల్ అయినట్లు బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ఇంకా ములుగు జిల్లాలో 30 శాతం మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ప్రక్రియలో అర్హులైన రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూసి పెద్ద సంఖ్యలో రెన్యూవల్ కూడా చేసుకోలేదు. దీంతో ఆయా రైతులకు ప్రస్తుతం రుణమాఫీ ప్రక్రియ వర్తిస్తుందా..?లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

రేపు ఎస్టీ బాలికల గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కాటారం, జూన్ 8: కాటారం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 10న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజారాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఎస్టీ విద్యార్థినులు మాత్రమే స్పాట్ అడ్మిషన్ కోసం హాజరు కావాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

గోవిందరావుపేట, జూన్ 8: గ్రామాల్లోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను ఎంఈవో దివాకర్ కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చల్వాయి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చల్వాయిలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, తెలుగు, ఇంగ్లిష్‌మీడియం బోధనతోపాటు డిజిటల్ తరగతులు, కంప్యూటర్ విద్య, ఉచిత భోజనం, టిఫిన్, రెండు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి విద్యాభ్యున్నతికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రమణమూర్తి, శ్రీనివాసరావు, సారయ్య, దీప్తి, అన్నపూర్ణ, శ్రీదేవి, వాసుదేవరెడ్డి, మాధవిలత, శివనాగేశ్వర్‌రావు, అంగన్‌వాడీ టీచర్ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపుపై హర్షం

ములుగు కలెక్టరేట్, జూన్ 8: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుపై జిల్లా కేంద్రంలో హర్షం వ్యక్తమైంది. తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు అచ్చునూరి కిషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తుప్పతి శ్రీనివాస్, దండే విజయ్, మచ్చ సందీప్, బండారి ప్రవీణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

వాజేడు, జూన్ 8: ఇసుక లారీల యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటించాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. భూపాల పట్నం-హైదరబాద్ జాతీయ రహదారి జగన్నాపథపురం ఫైజంక్షన్ వద్ద వాజేడు ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం వాహనాల తనిఖీలు చేశారు. ఇసుక లారీలను ఆపి నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా? అని పరిశీలించారు. ఇసుక డీడీలు, ఇతర పత్రాలను తనిఖీ చేశారు. ఓవర్‌లోడ్ వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 8: మండలంలోని ప్రజలు అసాంఘికశక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండలంలోని కర్రవానిగుంపు గ్రామంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై గ్రామస్థులను సమావేశ పరిచి మాట్లాడారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు ఎవరైనా వస్తే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని, బడీడు పిల్లలను బడికి పంపించాలని అన్నారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

10న రామప్ప భూములకు కౌలు వేలం

వెంకటాపూర్(రామప్ప), జూన్ 8: మండలంలోని పాలంపేటలో ఉన్న రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం భూములకు ఈనెల 10న కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఈవో బిల్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 కాలంలో ఒక పంట పండించుకునేందుకు వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు గోవిందరావుపేటలోని 10.14 ఎకరాలకు రూ.50వేలు, గణపురం మండలం బుద్దారంలోని 27గుంటలకు రూ.5వేలు, మండలంలోని రామాం జాఫూర్‌లోని 1.37 ఎకరాలకు రూ.5వేల ధరావత్ సొమ్ము చెల్లించి ఉదయం 11గంటలకు రామప్ప దేవాలయం ఆవరణలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామ సభలు

కాటారం, జూన్ 8: మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలు శనివారం నిర్వహించారు. మండలంలోని 24 జీపీల పరిధిలో 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వరకు ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన ఈజీఎస్ పనులను మూడు రోజులుగా తనిఖీలు నిర్వహించారు. సోషల్ ఆడిట్ స్టేట్ రీసోర్స్ పర్సన్ కొమురయ్య ఆదేశాల మేరకు డీఆర్పీలు, వీఎస్‌ఏలతో కూడిన 12 ఆడిట్ బృందాలు తొలి విడతలో మండలంలోని రేగులగూడెం, దామెరకుంట, విలాసాగర్, ఒడిపిలవంచ తదితర 12జీపీల పరిధిలో గ్రామసభలు నిర్వహించాయి. తనిఖీ సందర్భంగా తేలిన అంశాలను గ్రామసభల్లో చర్చించారు. మస్టర్ల నమోదులో ఉన్న సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. పని ప్రదేశాల్లో రికార్డుల ప్రకారం కొలతలు సరిపోలలేదని డీఆర్పీలు తెలిపారు. రెండు విడతల గ్రామ సభల అనంతరం ఈ నెల 13న మండల స్థాయిలో బహిరంగ ప్రజావేదిక నిర్వహించనున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి యువకుడి మృతి


శివ (ఫైల్)

వెంకటాపురం(నూగూరు), జూన్ 8: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని చిరుతఎల్లి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామ స్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మిచ్చా శివ(25) శుక్రవారం ఇంటి సమీపంలో ఉన్న తాటి ఆకులను కోసేందుకు చెట్టు ఎక్కాడు. కాళ్లు అదుపుతప్పి జారి కిందపడిపోయాడు. దీంతో శివకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని సూచించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

ములుగులో మంత్రి సీతక్క విస్తృత పర్యటన

ములుగు కలెక్టరేట్, జూన్ 8: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క శనివారం ములుగు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఉదయం ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వివిధ సమస్యలపై మంత్రికి పలువురు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం జాకారం గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెడిమిక్స్ ప్లాంటును ప్రారంభించారు. స్థానికులకు అందుబాటులో ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో ఇటీవల మృతిచెందిన కోరండ్ల నర్సింహారెడ్డి, ములుగు పట్టణంలో మృతిచెందిన గాదె లక్ష్మి, పంచాయతీ కార్మికుడు బలుగూరి సారయ్య కుటుంబాలను మంత్రి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు ఉన్నారు.


ఇంచర్లలో నర్సింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీతక్క

చేపలకు మస్తు గిరాకీ

గణపురం, జూన్ 8: మృగశిర కార్తె శనివారం ప్రవేశించింది. దీంతో చేపలకు గిరాకీ బాగా పెరిగింది. మృగశిర నాడు చేపలు తినాలనే ఆనవాయితీ ఉండగా మండల కేంద్రంలోని చేపల మార్కెట్ వద్ద చేపల కొనుగోలు జోరుగా కనిపించింది. వ్యాపారులు ఇదే అదునుగా భావించి రేట్లను ఒక్కసారిగా పెంచేశారు. ఎప్పుడూ సాధారణంగా రూ. 150- 200కు అమ్మాల్సి ఉండగా రూ.50-100 అదనంగా రేటును పెంచారు. బొమ్మె చేపలకు రూ. 450 వరకు డిమాండ్ పెరిగింది. అయినప్పటికీ కొనుగోళ్లు ఏమాత్రం తగ్గలేదు. మృగశిర నాడు చేపలు తింటే ఆరోగ్యం బాగుండి, వ్యాధులు దరిచేరవనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది.

● కాటారం : మండలంలో మృగశిర కార్తె ప్రారంభమయ్యే శనివారం రోజున జాతర సందడి నెలకొంది. ప్రజలు చేపల కొనుగోలుకు ఉత్సాహం చూపారు. మృగశిర కార్తె ప్రారంభం రోజున చేపలు తినాలనే ఆనవాయితీ ఉండటంతో వందలాదిగా ప్రజలు చేపల కోసం చెరువులు, కుంటలు, మార్కెట్లకు పరుగులు తీశారు. వ్యాపారులు మృగశిర కార్తెతో ప్రజలు చేపల కోసం ఎగబడటంతో రేట్లను అమాంతం పెంచి అమ్మారు. బొచ్చె, రాహు, బంగారు తీగ వంటి చేపలకు మామూలు రోజుల్లో కిలోకు రూ. 120 ఉండగా మృగశిర కార్తె పేరిట కిలోకు రూ. 200 వరకు అమ్మారు. కొరమీను(కొర్రమట్ట), బొమ్మె చేపలకు కిలోకు రూ.400కు పైగా రేటు పలికింది.


గణపురంలో చేపల అమ్మకాలు

లోక్ అదాలత్‌తో సమయం ఆదా

భూపాలపల్లి జిల్లా జడ్జి నారాయణబాబు

కాకతీయఖని, జూన్ 8: జాతీయ లోకదాలత్‌లో రాజీ పడితే సమయం ఆదా అవుతుందని భూపాలపల్లి జిల్లా జడ్జి పి.నారాయణబాబు అన్నారు. జిల్లా కోర్టులో శనివారం లోకదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులు రాజీపడి కేసులను పరిష్కరించుకుంటే జీవితంలో ప్రశాంతత ఉంటుందన్నారు. సమయం, డబ్బులు వృధా కావన్నారు. కేసుల్లో ఇరుక్కుని పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ, తిరిగి మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దని శనివారం ఒక్క రోజులోనే సుమారు 850 కేసులు పరిష్కారమయ్యాన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు సురేష్, ప్రధాన కార్యదర్శి మహేందర్, న్యావాదులు రవీందర్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో కేసు వివరాలు పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

తొలి జడ్పీటీసీ మల్లయ్య మృతి


మల్లయ్య (ఫైల్)

కాటారం, జూన్ 8: మండలంలో తొలి జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడైన (జడ్పీటీసీ) దుర్గం మల్లయ్య(59) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందడంతో కోలుకున్నారు. ఇటీవల మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఇంటి వద్దే తుది శ్వాస విడిచారు. మండలంలోని జాదరావుపేట జీపీ పరిధి లోని గూడూరు గ్రామానికి చెందిన మల్లయ్య జడ్పీటీసీల వ్యవస్థ ప్రారంభమైన 1996లో కాంగ్రెస్ నుంచి మండలంలో ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆయనకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన సభ అప్పటి స్పీకర్ శ్రీపాదరావు జడ్పీటీసీ టికెట్ కేటాయించగా పోటీ చేసి గెలు పొందారు. మల్లయ్య మృతదేహానికి పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు.

గ్రూప్-1 పరీక్షకు నిబంధనలు సడలించాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

ములుగు కలెక్టరేట్, జూన్ 8: రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది నిరుద్యోగులు ఆశతో ఎదురుచూస్తున్న గ్రూప్-1 ఉద్యోగాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షకు నిబంధనలను సడలించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు, అరగంట ముందు గేట్లు మూసివేస్తామనే నిబంధనలను ప్రభుత్వం విరమించుకోవాలని పేర్కొన్నారు.

కేసీఆర్‌ను కలిపిన మాజీ సర్పంచ్

టేకుమట్ల, జూన్ 8: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మండలంలోని సోమన్‌పల్లి మాజీ సర్పంచ్ వుద్దమారి మహేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎన్నికల ఫలితాలపై ఎర్రవెల్లి ఫాం హౌస్‌లో శనివారం నిర్వహించిన సమావేశం సందర్భంగా మాజీసీఎం చంద్రశేఖర్‌రావున్ వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ వుద్దమారి మహేష్ తెలిపారు.

ఇసుక టిప్పర్ల సీజ్

వెంకటాపురం(నూగూరు), జూన్ 8: మండలంలోని వీరభద్రవరం ఇసుకరీచ్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. తహసీల్దార్ వీరభద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీరభద్రవరం గ్రామ సమీపంలోని గోదావరి ఇసుకరీచ్ నుంచి టిప్పర్లతో ఇసుకను డంపింగ్ చేస్తున్నట్లు సమాచారం అందిందని అన్నారు. దీంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని, ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ముమ్మరంగా 'బడిబాట'

చిట్యాల, జూన్ 8: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు సాధించిన ప్రగతిని వివరిస్తున్నారు.

వెంటకటాపూర్ మండలంలో..

వెంకటాపూర్(రామప్ప) : మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బడీడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ఇందుకోసం విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధనతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు అందించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమాల్లో ఉపాధ్యాయులు జనగాం బాబూరావు, పెండ్యాల సలేంద్రం, కిరణ్, సత్యం, ప్రవీణ, వేణు,దేవి, చందన తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు

కాటారం, జూన్ 8: ఎన్నికల కోడ్ మూడు రోజుల క్రితం ముగిసింది. అయినా రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు మాత్రం తొలగలేదు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరసగా రెండు నెలలకు పైగా ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయి. ఎన్నికల కోడ్ నిర్వహణను పటిష్టంగా అమలు చేయాల్సిన అధికారులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు విగ్రహానికి వేసిన ముసుగును ఇంకా తొలగించలేదు.


ఎంపీడీవో కార్యాలయంలో ముసుగుతో ఉన్న శ్రీపాద విగ్రహం

రామోజీరావు మృతికి సంతాపం

గోవిందరావుపేట/వాజేడు, జూన్ 8: చెరుకూరి రామోజీరావు అకాల మృతిపట్ల గోవిందరావుపేట, వాజేడులో శనివారం పలువురు సంతాపం తెలిపారు. గోవిందరావుపేటలో తెలంగాణ కమ్మసంఘం అధ్యక్షుడు గాంధీ ఆధ్వర్యంలో నాయకులు నివాళులు అర్పించారు. కమ్మ సంఘం నాయకులు పాలడుగు ఉమామహేశ్వర్‌రావు, తలశిల వెంకన్న, గోపి, సాంబశివరావు, కసుకుర్తి జగన్మోహన్‌రావు, తుమ్మల హరిబాబు, పాలడుగు వెంకటకృష్ణ, తలశిల ప్రసాద్, కొత్తపల్లి ప్రసాద్, జయప్రకాష్, ఆకుల యుగంధర్, తదితరులు పాల్గొన్నారు. వాజేడులో మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ దావూద్, పాత్రికేయులు గార నరసింహరావు, వద్లూరి వరప్రసాద్, గంటా సర్వేశ్వరరావు, గార మల్లికార్జునరావు, పసుపులేటి సతీష్, స్థానికులు బోదెబోయిన కృష్ణ, చందర్‌రావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

మల్హర్, జూన్ 8 : తాగునీటి సమస్య తీర్చాలని మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలోని రెండో వార్డుకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో శనివారం నిరసన తెలిపారు. గత వారం రోజుల నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే వారే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య తీర్చడానికి బోరు వేసినా మోటారు ఏర్పాటు చేయక పోవడం వల్ల నీటికి కష్టం వచ్చిందని తెలిపారు. దీంతో చేసేది లేక సమీపంలోని పొలాల వద్ద నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేశారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

కొనలేని పరిస్థితిలో సామాన్యులు

కాకతీయఖని, జూన్8: భూపాలపల్లిత జిల్లాలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు సతమతమవుతున్నారు. ధరలు ఇలా రోజురోజుకూ పెరుగుతుంటే బతికేదెట్లా...? అని ఆందోళన చెందుతున్నారు. ఇష్టమైన కూరలు వండుకొని తినాలన్నా కష్టంగా ఉందని నిరుపేదలు బెంబేలెత్తుతున్నారు.

జిల్లాలో కూరగాయల సాగు తక్కువగా చేయడంతో పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కిలో కురగాయల ధర రూ.50 నుంచి రూ. 100 పలుకుతోంది. రెక్కాడితే గానీ డొక్కాడని సామాన్య ప్రజలకు కూరలు వండుకొని తినడం ఇబ్బందికరంగా మారింది. పచ్చి మిర్చి ధర సామాన్యులకు మంట పుట్టి స్తోంది. గత నెలలో రూ.50గా ఉన్న పచ్చి మిర్చి ప్రస్తుతం రూ.120 ఉంది. దీంతోపాటు బీరకాయ, కొత్తిమీర, ములక్కాయ, పూదీన ధరలు రూ. వందకు పైగా పలుకుతున్నాయి. అలాగే క్యారెట్, గోరుచిక్కుడు ధరలు రూ.80 ఉండగా ఆకుకూరల ధర రూ.60గా ఉంది. అయితే పాత పంటలు అయిపోయి, కొత్తపంటలు సాగుచేస్తుం డడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

భూపాలపల్లి మార్కెట్‌లో కూరగాయల ధరలు

కాయగూర పేరు	ధర(కిలో)	గత ధర
కొత్తిమీర	రూ. 150	రూ. 60
మునక్కాయ	రూ.120	రూ. 50
బీరకాయ	రూ. 120	రూ. 50
పచ్చిమిర్చి	రూ. 120	రూ. 50
పూదీన	రూ. 100	రూ. 50
క్యారెట్	రూ. 80	రూ. 40
గోరు చిక్కుడు	రూ. 80	రూ. 40
పాలకూర	రూ. 60	రూ. 20
తోటకూర	రూ. 60	రూ. 20
టమాట	రూ. 50	రూ. 20
వంకాయ	రూ. 40	రూ. 20





విద్యుదాఘాతంతో గేదెల మృతి

కన్నాయిగూడెం, జూన్ 8: విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని గుర్రేవుల లో శనివారం చోటు చేసుకుంది. మండలం లోని గుర్రేవుల గ్రామానికి చెందిన మరం శివ, పూజారి దామోదర్‌కు చెందిన మూడు పాడిగేదెలు శుక్రవారం మేత కోసం సమీపంలోని చేళ్లలోకి వెళ్లి స్తంభం విరిగి కింద వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లను తాకాయి. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి.

గంజాయి స్మగ్లర్ల అరెస్టు

▸▸ రూ.50లక్షల గంజాయి స్వాధీనం ▸▸ పరారీలో మరో ముగ్గురు

వరంగల్ క్రైం, జూన్ 8: భారీ స్థాయిలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠాను టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు కలిసి అరెస్టు చేశారు. అలాగే రూ.50 లక్షల విలువ కలిగిన 192 కిలోల గంజాయితో పాటు ఒక కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో డబ్బాల జంక్షన్ వద్ద నివాసం ఉంటున్న గజ్జి సహదేవ్, మహారాష్ట్రకు చెందిన యోగేశ్వర్, రాందాస్ ఉన్నారు. ఒరిస్సాకు చెందిన పాండు, లక్ష్మీతాటీ, మహారాష్ట్రకు చెందిన వికాస్ పరారీలో ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శనివారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు.

నగరంలోని డబ్బాల జంక్షన్ వద్ద నివాసం ఉంటున్న గజ్జి సహదేవ్ కారు డ్రైవర్‌గా చేస్తుంటాడు. ఇతడికి మిగతా నిందితులతో పరిచయం ఏర్పడింది. సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో కొద్దిరోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు మండలం తునగొండ గ్రామ పరిసరాల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఇదే క్రమంలో 192 కిలోల గంజాయి కొనుగోలు చేసి రెండు కిలోల చొప్పున 96 ప్యాకెట్లు చేసి చింతూరు నుంచి ములుగు జిల్లా ఏటూరునాగారం మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో శనివారం దామెర సమీపంలోని శ్రీహర్ష స్కూల్ వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన గజ్జి సహదేవ్‌పై గతంలో పరకాల, హనుమకొండ పోలీస్‌స్టేషన్లలో గంజాయి స్మగ్లింగ్ కేసులున్నాయి. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సీఐలు రాజు, రవికుమార్, ఎస్ఐలు నిస్సార్ పాషా, శరత్‌కుమార్, దామెర ఎస్ఐ అశోక్, ఏఏవో సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు సురేష్, శ్రీనివాస్, అప్జల్‌ఖాన్, సతీష్, నాగరాజులను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.


గంజాయి పట్టుకున్న పోలీస్ సిబ్బందితో కమిషనర్